బల్దియాలో విచ్చలవిడిగా అవినీతి

- రెచ్చిపోతున్న రెవెన్యూ అధికారులు
- ప్రతి పనికీ డబ్బుల డిమాండ్
- ఏడాది కిత్రమే భారీ నగదుతో ఏసీబీకి చిక్కిన ఆర్వో నరేందర్



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అవినీతికి కేరాఫ్‌గా మారింది. చిన్న పని మొదలు పెద్ద పనుల వరకు చేతులు తడపనిదే పనులు కావడం లేదు. బుధవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఏసీబీకి పట్టుబడటమే అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

మున్సిపల్‌లోని అన్ని విభాగాల్లో లంచావతారులు పెరిగిపోయారు. 2024 ఆగస్టు నెలలో ఆర్వో దాసరి నరేందర్ తన నివాసంలో కోట్లాది రూపాయల నగదుతో పట్టుబడటం అప్పట్లో సంచలనం రేపింది. ఆయనకు ఇప్పటివరకు పోస్టింగ్ ఇవ్వలేదు. ఏసీబీ కేసులో ఆరునెలల జైలు శిక్ష తర్వాత బెయిల్‌పై వచ్చినా రెండేళ్ల వరకు తిరిగి పోస్టింగ్ ఇవ్వరు.

త్రుటిలో తప్పించుకున్న పెద్ద చేపలు..

రెవెన్యూ విభాగంలో విచ్చలవిడిగా అవినీతి పెరిగిపోయిందని, ప్రతీ చిన్న పనికి డబ్బులు అడుగుతున్నారని నగరవాసులు వాపోతున్నారు. కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా పనులు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే ముందుగా ఆర్ఐ శ్రీనివాస్‌ను కలిసి రండి అని నేరుగా చెబుతున్నారు. దీంతో పైస్థాయి అధికారులు కూడా నేరుగా డబ్బులు తీసుకుంటున్నారు. సర్టిఫికెట్ కోసం వచ్చిన ఓ ఆర్మీ జవాన్ వద్ద బుధవారం రెవెన్యూ ఉన్నతాధికారులకు డబ్బులు ఇవ్వాలని చెబుతూ లంచం తీసుకున్నట్లు ఆర్ఐ శ్రీనివాస్ వెల్లడించడం గమనార్హం. ఏసీబీ అధికారులు రెవెన్యూ ఉన్నతాధికారిపైనే గురిపెట్టారు. చివరిక్షణంలో చిన్న అధికారి చిక్కారు. ఉన్నతాధికారి త్రుటిలో తప్పించుకున్నాడని, త్వరలోనే ఏసీబీ వలలో పడతారని బల్దియాలో నేరుగా చర్చించుకుంటున్నారు.

డిజిటల్ అరెస్టులు ఉండవు


మాట్లాడుతున్న సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు

ఖలీల్‌వాడి: నకిలీ అధికారుల పేరు చెప్పి ఫోన్ చేసి డబ్బులు వసూళ్లు చేయడానికి ప్రయత్నించే సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు భయపడకూడదని సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పాత ఎమ్మార్వో కార్యాలయంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యాలయంలో సైబర్ క్రైమ్ మోసాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోషల్ మీడియా ప్రకటన మోసాలు: నమ్మశక్యం కాని ఆఫర్లు, నకిలీ లింకులు ద్వారా మోసం జరిగే విధానాలపై హెచ్చరికలు చేశారు. ఎవరైనా మోసాలకు గురైతే కాలువు 1930 నంబర్‌కి తక్షణమే సంప్రదించవచ్చని, లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ పరిశోధన సదస్సుకు అందె జీవన్ రావు



నిజామాబాద్ రూరల్: ఈనెల 6,7 తేదీల్లో బంగ్లాదేశ్‌లో జరిగే అంతర్జాతీయ పరిశోధన సదస్సులో రాష్ట్ర అవార్డు గ్రహీత, గుంజీళ్ల జాతీయ ప్రచారకులు అందె జీవన్ రావు పాల్గొననున్నారని అఖిల భారత రచయితల సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంకణాల రాజేశ్వర్ బుధవారం తెలిపారు. ఈసదస్సులో సూపర్ బ్రెయిన్ యోగా ఏజ్ ఏ పెడగాజికల్ టూల్ ఫర్ సుపీరియర్ ఇంటెలెక్ట్ అండ్ వెల్ బీయింగ్ అనే అంశంపై తన పరిశోధనా పత్రాన్ని సమర్పించి ప్రసంగించనున్నారని పేర్కొన్నారు. ఈసందర్భంగా జిల్లాకేంద్రంలో డీఈవో అశోక్, జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్ అందెకిషన్ రావును అభినందించారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ధర్పల్లి: ఈనెల 7న హైదరాబాద్‌లో జరగబోయే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు కోరారు. ఈ మేరకు ధర్పల్లి మండల కేంద్రంలో బుధవారం పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాలయ్య, పద్మ, భూమేష్ ,ఎల్లయ్య, గంగాధర్, నర్సగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



సిరికొండ: మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్‌కు జిల్లా గౌడ యువసేన సభ్యులు ఆర్థిక సాయం చేశారు. శ్రీనివాస్‌గౌడ్ ఇటీవల తాటి చెట్టుపై నుంచి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ విషయం తెలిసిన గౌడ యువసేన సభ్యులు బాధితుడికి రూ. 10,000 లు బుధవారం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి దేగాం శ్రీకాంత్‌గౌడ్, క్యాషియర్ బొంగు హరీష్‌గౌడ్, నరేందర్‌గౌడ్, మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, గౌరవాధ్యక్షుడు గణేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ల పంపిణీ అభినందనీయం


కార్యక్రమంలో నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ట్రాఫిక్ సీఐ ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖలీల్‌వాడి: సామాజిక సేవలో భాగంగా హెల్మెట్ల పంపిణీ చేపట్టిన బెన్నీ సేవలు అభినందనీయమని సీపీ సాయిచైతన్య అన్నారు. నగరంలోని గూపన్‌పల్లిలో అదే ప్రాంతానికి చెందిన బెన్నీ తన కుమార్తె అద్విక జన్మదినం సందర్భంగా 60 మందికి హెల్మెట్లను మంగళవారం పంపిణీ చేశారు. విషయం తెలుసుకున్న సీపీ వారిని బుధవారం పోలీస్ కార్యాలయంలో అభినందించి సన్మానించారు.

వరద బాధితులకు చేయూత



ధర్పల్లి: మండలంలోని హొన్నాజీపేట్ పరిధిలోని వడ్డెర కాలనీలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు వరద బాధితుల కుటుంబాలకు నిత్యవసర సరుకులను బుధవారం పంపిణీ చేశారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజ్ పాల్ రెడ్డి, శ్రీనివాస్ నాయక్, వెంకట్ రాజ్ , బన్నీ తదితరులు పాల్గొన్నారు.

డీజేలు పెడితే చర్యలు తప్పవు

ఖలీల్‌వాడి: గణేశ్ మండపాల్లో నిర్వాహకులు డీజేలు పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని పట్టణ సీఐ శ్రీనివాస్‌రాజు బుధవారం అన్నారు. పలుచోట్ల మండపాల నిర్వాహకులు సౌండ్ పరిమితిని పెంచుతుండడంతో ప్రజలు, విద్యార్థులు, వ్యాధిగ్రస్తులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. మహారాష్ట్ర నుంచి డీజే లను కిరాయికి తీసుకొస్తున్నట్లు తెలుస్తోందని అలాంటివి చేయొద్దన్నారు. డీజే, సౌండ్ సిస్టమ్, వాహనాలను సీజ్ చేస్తామన్నారు. సౌండ్ సిస్టమ్ నిర్వాహకులు కూడా పోలీసులకు సహకరించాలన్నారు. ప్రజలు గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. నిమజ్జన సమయంలో మండపాల నిర్వాహకులు పలు జాగ్రత్తలు పాటించాలని, విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు సహకరించాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించిన కేంద్ర బృందం



బాల్కొండ: సుపోషిత్ గ్రామపంచాయతీ అభియాన్‌లో ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామంలో బుధవారం అంగన్ వాడీ కేంద్రాలను కేంద్ర బృందం పరిశీలించింది. అంగన్ వాడీ కేంద్రాల్లో గర్భిణి, బాలింతలు, చిన్న పిల్లలకు అందిస్తున్న పోషకాహార వివరాలను బృంద సభ్యులు అడిగి తెలుసుకున్నారు. పిల్లల బరు వు, ఎత్తు కొలతలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సిరికొండ: మండలంలోని కుర్దుల్‌పేట్, తూంపల్లి గ్రామాల్లో బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. కుర్దుల్‌పేట్‌లో బాధితులకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు ప్రసాద్, ప్రభాకర్, తూంపల్లిలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు రాజేశ్వర్‌గౌడ్, మాన్‌సింగ్, బాలరాజ్‌నాయక్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

వచన కవిత్వం – లఘు కవితా రూపాలుపై అతిథి ఉపన్యాసం

నిజామాబాద్‌అర్బన్: గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల కొరవి గోపరాజు తెలుగు విభాగం ఆధ్వర్యంలో బుధవారం అతిథి ఉపన్యాసం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషలో ఎంతో సాహిత్యం ఉందాన్నారు. కార్యక్రమ ముఖ్యవక్త డా.పద్మారాణి ×వచన కవిత్వం – లఘు కవితా రూపాలు అనే అంశంపై ఉపన్యాసం చేశారు. విద్యార్థులు సామర్థ్యాలు మెరుగు దిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నం, కామర్స్, బీబీఏ విభాగం అధిపతులు వినాయకుమార్, డాక్టర్ రంజిత, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రాజేష్, అదనపు అకాడమిక్ కోఆర్డినేటర్లు నహేద బేగం, రాహుల్, కార్యక్రమ నిర్వాహకురాలు డాక్టర్ శమంత, , రాధిక, అర్చన, రజిత, తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజన బిల్లులు గ్రీన్ చానల్ ద్వారా ఇవ్వాలి

నిజామాబాద్‌అర్బన్: మధ్యాహ్న భోజన బిల్లులను గ్రీన్ ఛానల్ ద్వారా అందజేయాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. గ్రీన్ చానల్ ద్వారా బిల్లులు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేటి వరకు జీవో ఇవ్వకపోవడం విడ్డూరం ఉందన్నారు. ఈకార్యక్రమంలో స్రవంతి. సాయమ్మ. గంగాధర్. గౌస్. కవిత. రమ తదితరులు పాల్గొన్నారు

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

నిజామాబాద్‌అర్బన్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ బుద్ధిరాజ్ మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థి చదువులో రాణించాలన్నారు. అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాత్రలలో స్వయంపాలన దినోత్సవం నిర్వహించిన విద్యార్థినులకు ప్రిన్సిపల్ బుద్ధిరాజుతో పాటు కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది బహుమతులను అందజేశారు.

ఎంపీ నిధులతో బోర్గాం(పి)లో బోరు మోటారు


బోర్గాం(పి) 5వ డివిజన్‌లో బోరు వేస్తున్న దృశ్యం

మోపాల్: నగరశివారులోని బోర్గాం(పి) 5వ డివిజన్‌లో కాలనీవాసులకు తాగునీటి సౌకర్యం లేకపోవడంతో స్థానిక నాయకులు ఎంపీ అర్వింద్ దృష్టికి తీసుకెళ్లగా బోరు మోటార్ కోసం నిధులు కేటాయించారు.బుధవారం కాలనీలో బోరు వేసి, మోటారును బిగించారు. కాలనీవాసుల దాహార్తి తీర్చిన ఎంపీ అర్వింద్ ధర్మపురి, సహకరించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రచ్చ ఆనంద్, తోట శాస్త్రి, కల్లెడ భాస్కర్, యాదల గంగాధర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీని కలిసిన మొటాటిరెడ్డి పట్టణ కార్యవర్గం


అరికెల నర్సారెడ్డిని సన్మానిస్తున్న కార్యవర్గ సభ్యులు

సుభాష్‌నగర్: నిజామాబాద్ పట్టణ మొటాటి రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం నగరంలోని ప్రగతినగర్‌లో మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నర్సారెడ్డిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెడ్డి సంక్షేమ సంఘం అభివృద్ధికి తన సహకారం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు. జిల్లాలో ఉన్న అందరినీ కలుపుకుని ముందుకు పోవాలని సూచించారు. పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గాధారి సంజీవ్‌రెడ్డి, మోతె నవీన్‌రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, సంఘ సభ్యులు వినోద్‌రెడ్డి, గంగారెడ్డి, సుభాష్ రెడ్డి, శేఖర్ రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గణనాథులకు ఘనంగా పూజలు


ముబారక్‌నగర్‌లోని గణేశ్ మండలి వద్ద కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు


డీ-2 సెక్షన్ తిలక్‌గార్డెన్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో అన్నదానంలో పాల్గొన్న ఉద్యోగులు

నిజామాబాద్ రూరల్/ధర్పల్లి : వినాయక నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. 18వ డివిజన్ ముబారక్ నగర్ శ్రీ జనప్రియ నగర్ కాలనీలో ఓం గణేష్ మండలి వద్ద కుంకుమార్చన, దీపారాధన నిర్వహించారు. మహిళలకు పూజ సామగ్రి వితరణ అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రవీందర్ ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, కోశాధికారి గోపాల్ ఉపాధ్యక్షులు బాల కేశవ నాయుడు సభ్యులు అశోక్, నర్సింగరావు, సురేష్ కాలనీ మహిళలు పాల్గొన్నారు అంబేద్కర్ కాలనీలోని శ్రీశివ శక్తి యూత్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ముత్యాల నర్సింగ్, వెంకటేశ్, గణేష్,ప్రసాద్, లక్ష్మన్, మధు, కుమార్,శేఖర్‌లున్నారు. ధర్పల్లి మండలం మైలారం గ్రామంలో గణేశ్ మండలి ఆధ్వర్యంలో గణనాథుడికి ఘనంగా పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో విగ్రహ దాత విశ్వనాథం నవీన్ కుమార్,గణేష్, నవీన్ చారి, నాగేష్, శేఖర్ సంతోష్, గంగాధర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల వేషధారణ

నగరంలోని గుమస్తాకాలనీలోని దుర్గామాత ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద చిన్నారుల ప్రదర్శన ఆకట్టుకుంది.చిన్నారులు కృష్ణుడు, గణపతి, పోతారాజు, అన్నపూర్ణ దేవి, గోపిక వంటి వేషధారణల్లో పాల్గొని భక్తులను అలరించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షులు ఆమందు విజయ్ కృష్ణ మాట్లాడారు. ఈకార్యక్రమంలో కోశాధికారి ధాత్రిక వేణుగోపాల్, గణేశ్ కమిటీ అధ్యక్షులు ధాత్రిక గంగసాయి, కార్యదర్శి ధాత్రిక అఖిల్ రాజ్, సభ్యులు హరీష్, ప్రవీణ్, భక్తులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: నగరంలోని ఎన్‌పీడీసీఎల్ డీ-2 సెక్షన్ తిలక్‌గార్డెన్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు విఘ్నేశ్వరుడికి ఎస్ఈ రాపల్లి రవీందర్, డీఈలు అల్జాపూర్ రమేష్, ఎం శ్రీనివాస్, డి వెంకటరమణ, కామేశ్వర్‌రావు, టౌన్ ఏడీఈ-2 ప్రసాద్‌రెడ్డి,ఏడీఈలు తోట రాజశేఖర్, 1104 యూనియన్ కంపెనీ అధ్యక్షుడు రఘునందన్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహా అన్నప్రసాదం కార్యక్రమాన్ని ఎస్ఈ ప్రారంభించారు.వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు, కార్మికులు 500మంది వరకు పాల్గొన్నారు.



దుర్గామాత ఆలయంలో గణేశుడి వద్ద దేవతలు, సంప్రదాయ వేషధారణలో చిన్నారులు

పాలాజ్ కర్ర గణపతిని దర్శించుకున్న ఎమ్మెల్యే ధన్‌పాల్


పాలాజ్‌లో కర్ర గణపతికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్


సుభాష్‌నగర్: తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో కొలువుదీరిన పాలాజ్ కర్ర గణనాథుడిని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ బుధవారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు సార్వజనిక్ గణేశ్ మండలి సభ్యులు, ఆలయ పూజారులు ఎమ్మెల్యేను పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్ర గణపతి ఎన్నో తరాల భక్తుల నమ్మకానికి కేంద్ర బిందువుగా నిలుస్తుందని, ఏడు దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ పవిత్ర క్షేత్రం భక్తుల ఆకాంక్షలను, కోరికలను తీరుస్తుందని నమ్మకమన్నారు. కర్ర గణపతి ఆశీర్వాదంతో దేశ, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా, ఆయురారోగ్యాలతో ఉండాలని, రైతులకు అనుకూల వర్షాలు కురిసి పాడి పంటలు బాగా పండాలని వేడుకున్నట్లు తెలిపారు. బీజేపీ నాయకులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, ఇల్లెందుల ప్రభాకర్, హరీష్‌రెడ్డి, చింతకాయల రాజేందర్, తదితరులున్నారు.

ముంబయి లాల్‌బాగ్ గణేశ్‌ను దర్శించుకున్న గడుగు


పుస్తకం అందుకుంటున్న గడుగు

నిజామాబాద్ సిటీ : జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మహారాష్ట్రలోని ముంబయి లాల్ బాగ్ గణేశ్‌ను దర్శించుకున్నారు. బుధవారం రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నరాల రత్నాకర్‌లు గణేశ్‌ను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ బాలాసాహెబ్ నాయకులను సన్మానించి వినాయకుడి చరిత్ర పుస్తకం బహూకరించారు. జిల్లాకు చెందిన చాలా మంది భక్తులు వినాయక చవితి సందర్భంగా ముంబయి వెళ్లి లాల్‌బాగ్ గణేశ్ ఉత్సవాలలో పాల్గొంటున్నారు.

విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారు



మాట్లాడుతున్న ఎస్‌పి స్టాలిన్

నిజామాబాద్‌అర్బన్: పాలకులు విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎస్‌ఏ స్టాలిన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాలుగో మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో కొత్త సమస్యలను సృష్టిస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ విద్యాశాఖ మంత్రిని కూడా నియమించలేని దుస్థితి ఏర్పడిందన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ విడుదల చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర 4వ మహాసభలు వేదికగా నిలిచాయని పేర్కొన్నారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకురాలు పద్మ మాట్లాడుతూ 1936లో ఉత్తరప్రదేశ్‌లో అఖిల భారత విద్యార్థి సమైక్య ఆవిర్భవించిందన్నారు. ప్రభుత్వ విద్య పరిరక్షణకై విద్య రంగ సమస్యలపై సమరశీల ఉద్యమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పౌరుల చదువుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు భూమయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య. జెవీవీ రాష్ట్ర నాయకులు రామారావు, ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్‌మారయ్యగౌడ్, కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ రజనీకాంత్, టీబీసీ విద్యా సంస్థల చైర్మన్ ప్రవీణ్, ఎస్సార్ విద్యాసంస్థల జోనల్ ఇన్‌చార్జి శ్రీకాంత్, అల్ఫోర్స్ జోనల్ ఇన్‌ఛార్జి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాత్కాలిక ఫీజు చలాన్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలి



తెయూ(డిచ్‌పల్లి): సీపీగెట్ ద్వారా పీజీ కోర్సుల్లో ప్రవేశాలు, లాసెట్ ద్వారా న్యాయ కళాశాలలో ప్రవేశాలు కొనసాగుతున్న సందర్భంగా విద్యార్థుల సౌకర్యార్థం ఆర్ట్స్ కళాశాలలో తాత్కాలికంగా ఫీజు చెల్లింపు చలాన్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తెయూ వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు, ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ శ్వేత ను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేశ్ మాట్లాడుతూ.. ప్రతి విద్యాసంవత్సరంలో సీపీగెట్, లాసెట్ కౌన్సిలింగ్ ద్వారా వర్సిటీలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు జాయినింగ్ కోసం వచ్చినప్పుడు చలాన్ చెల్లించడానికి ఆర్ట్స్ కళాశాల నుంచి పరిపాలనా భవనం వరకు కాలినడకన వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థుల కోసం ఎస్‌బీఐ చలాన్ కౌంటర్‌ను తాత్కాలికంగా ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఇంజనీరింగ్ విద్యార్థులకు హాస్టల్ సౌకర్యాన్ని కల్పించాలని విన్నవించారు. ఎస్సీ ఎస్టీ, బీసీ, నాన్ స్కాలర్‌షిప్ విద్యార్థుల హాస్టల్ డిపాజిట్లను తగ్గించడంతో పాటు రూల్ ఆఫ్ రిజర్వేషన్స్ ను అమలు చేయాలని వీసీని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, వర్సిటీ అధ్యక్షులు జీషణ్, నాయకులు నాగేంద్ర, నిరంజన్ , శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మోపాల్ జెడ్పీహెచ్ఎస్‌లో అభ్యసన మేళా



మోపాల్: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బోధన అభ్యసన మేళాను బుధవారం నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యాబోధనలో ఉపయోగించే అభ్యసన సామగ్రిని ప్రదర్శించారు. ప్రదర్శనను మండల విద్యాధికారి గేమ్‌సింగ్ హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా గేమ్ సింగ్ మాట్లాడుతూ విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేపట్టాలని తెలిపారు. టీటీయూ జిల్లా అధ్యక్షుడు లాటికర్ రాము, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్ గౌడ్, కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెపటైటిస్ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించాలి



నిజామాబాద్ నాగారం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి హెపటైటిస్ బి వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ తెలిపారు. బుధవారం డీఎంహెచ్‌వో ఛాంబర్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డా.శ్రీనివాస్‌ప్రసాద్, డీఐవో అశోక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.తుకారంరాథోడ్, నోడల్ ఆఫీసర్ తదితరులున్నారు.

చీరల పంపిణీ

నిజామాబాద్ నాగారం: వాసవి యువజన సంఘం ఆధ్వర్యంలో దసరా పండుగను పురస్కరించుకొని పెన్షనర్లకు చీరలు, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. దుస్తుల దాత సుశీల్ కుమార్ కేడియా, నిత్యవసర వస్తువుల దాత పోల ఆశ్విన్‌కుమార్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. వాసవి సంఘం సభ్యులు కొండ నర్సింగరావుగుప్త, దేవత చంద్రశేఖర్, పార్శి రాఘవేంద్ర, తదితరులున్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	108,400	వెండి(కిలో)	1,29,000
22 క్యారెట్స్	100,085	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	24	48	గాజరుగడ్డ	30	60
బెండకాయ	30	60	పచ్చిమిర్చి	30	60
బీరకాయ	40	80	దోసకాయ	15	30
దొండకాయ	30	60	ఆలుగడ్డ	20	40
జొర్సుకాయ	60	110	గోబిగడ్డ	15	30
కాకరకాయ	30	60	గోబిపువ్వు	30	60
వంకాయ	40	80	బీట్‌రూట్	30	60
పాలకూర	50	100	కరివేపాకు	40	80
మెంతికూర	60	110	చామగడ్డ	30	60
కొత్తిమీర	40	80	చిక్కుడుకాయ	60	100
పుదీనా	50	100	గోరుచిక్కుడు	40	80
క్యాప్సికం	40	80			

-సుభాష్‌నగర్